క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని తాండ్ర కొండారెడ్డిపల్లి జూపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కల్వకుర్తి విద్యుత్ ఏఈ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు.

వెల్దండ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సూర్యంనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

31న రామానుజ జీయర్‌స్వామి రాక

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయానికి 31న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి వస్తున్నట్లు ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు హిందూ ధర్మం, ధనుర్మాస ప్రాశస్త్యం గురించి భక్తులకు వివరిస్తారని పేర్కొన్నారు. వికాస తరంగిణి కల్వకుర్తి శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బిజినేపల్లి విద్యార్థి



బిజినేపల్లి: సీఎంకప్ పేరిట నిర్వహించిన క్రీడా పోటీల్లో బిజినేపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి సునీల్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల పీడీ నిరంజన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన సునీల్ జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై మండల ప్రజలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీకి సన్మానం



కల్వకుర్తిరూరల్: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ జాయింట్ సెక్రటరీగా పదోన్నతి సాధించిన డైమాండ్ స్టార్ కల్వ హరికృష్ణను ఘనంగా సన్మానించారు. వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షుడు హరికృష్ణను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జూలూరి రమేష్‌బాబు, కే రమేష్, రమేష్, జగదీశ్వర్, శంకర్, మనోహర్, లింగం, గోపాల్, అశోక్, శ్రీనివాసులు, రాఘవేందర్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి సంఘాలు ఆర్థిక బలోపేతం



తాడూరు: ఆయా గ్రామాల్లోని మహాలక్ష్మి సంఘాలు ఆర్థికంగా బలోపేతం కోసం కొత్త సభ్యులను ఎంపిక చేసుకుని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం శేఖర్ అన్నారు. శనివారం మండలంలోని ఐకేపీ కార్యాలయంలో మహాలక్ష్మి సంఘాలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 18ఏళ్ల నిండిన మహిళలను కొత్తగా సంఘాల్లో చేర్చుకుని రుణ సదుపాయం కల్పించాలన్నారు.

టెంకాయలు, లడ్డు వేలం



తిమ్మాజీపేట: సంక్రాంతి సందర్భంగా బ్రహ్మోత్సవాల నిర్వాహణ టెంకాయలు, లడ్డు వేలం పాటలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తిమ్మాజీపేట మండలంలోని అప్పాజిపల్లి సమీపంలో అప్పాద్రి గుట్టపై వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి బ్రహ్మోత్సవాలను ప్రతి ఏటా వేలం పాటలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం స్వామి వారి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. టెంకాయలను రూ.48,016 బోయిని స్వాతి సుందరయ్య దక్కించుకోగా, లడ్డు రూ.2016 బోయ సుందరయ్య దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- గామాల్లో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు
- ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సూచన
- లబ్ధిదారుల వివరాల యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశం



వెల్టూరులో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ మోహన్‌లాల్

ఉప్పునుంతల: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేను సకాలంలో పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ మోహన్‌లాల్ సూచించారు. శనివారం మండలంలోని వెల్టూరు తదితర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇళ్ల సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు. లబ్ధిదారుల నుంచి వాస్తవిక వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సర్వే జాబితాలో పేర్లు ఉన్న వారు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శిని కలిసి వారికి కావల్సిన వివరాలను నమోదు చేయించాలని సూచించారు. యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న లబ్ధిదారుని స్థితిగతుల ఆధారంగా ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.



వెల్దండ మండలం గాన్‌గట్టుతండాలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

కొనసాగుతున్న సర్వే

తాడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. మండంలోని మేడిపూర్, పొల్మూరు, గుట్టలపల్లిల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు తిరిగి వివరాలను సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మచారి, పంచాయతీ కార్యదర్శి శుభాకర్ తెలిపారు.



మేడిపూర్‌లో సర్వేలో అర్హుల వివరాలను సేకరిస్తున్న సిబ్బంది

సర్వేలో వేగం పెంచాలి

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గాన్‌గట్టుతండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ నెల చివరి నాటికి సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ లక్ష్మణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

కోడేరు: మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రావణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు జనుంపల్లి, తీగలపల్లి, మైలారం గ్రామాల్లో ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. అధికారులు ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేసేలా చూడాలన్నారు. సర్వేకు వచ్చే అధికారులకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అందుబాటులో ఉంచుకోని సహకరించాలన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలో పాల్గొన్న మహిళలు

బిజినేపల్లి/కొల్లాపూర్: మండలంలోని పాలెం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజల కోసం భక్తులు ప్రత్యేకంగా పాల్గొంటున్నారు. 12 రోజుల నుంచి ప్రారంభమైన ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కురవి రామానుజాచార్యులు తెలిపారు. అనంతరం భక్తులకు ఆలయ తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు.

- కొల్లాపూర్‌లోని ఆలయాల్లో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. పట్టణంలోని రామాలయం, బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి దేవాలయం, మాదవస్వామి దేవాలయంలో తెల్లవారు జామున పూజలు నిర్వహించారు.



కొల్లాపూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు



బిజినేపల్లి: శనిత్రయోదశి సందర్భంగా మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన జైష్ఠాదేవి సమేత శనేశ్వరాలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు తమ శనిదోష నివారణ కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు బ్రహ్మసూత్ర శివున్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

మర్రిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



తిమ్మాజీపేట: మాజీ శాసన సభ్యుడు మర్రి జనార్దన్‌రెడ్డి తండ్రి మర్రి జంగిరెడ్డి ఇటీవల మరణించడంతో శనివారం మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన కుమారుడు ప్రత్యేకంగా పరామర్శించారు. తిమ్మాజీపేట మండలంలోని నేరళ్లపల్లిలో మర్రి జంగిరెడ్డి చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళి అర్పించారు.

చికిత్స పొందుతూ సీనియర్ అసిస్టెంట్ మృతి



నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్యం వల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సీనియర్ అసిస్టెంట్ మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి తూడుకుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆయన మృతిపై పలువురు సంతాపం తెలిపారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. కొండనాగుల గ్రామానికి చెందిన రేణుక ఈనెల 13న మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడ గ్రామంలో తన తండ్రి వద్దకు వచ్చింది. తర్వాత ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె తండ్రి బుచ్చయ్య శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

పాన్‌గల్: మండలంలో ఉపాధి హామీ పథకంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన పనులకు ఖర్చు చేసిన నిధులపై నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీపై శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఉమాదేవి మాట్లాడుతూ.. మండలంలోని 28 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.5.15 కోట్లు ఖర్చు చేశారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రామసభల్లో కొలతలో వ్యత్యాసం, అదనపు డబ్బులు చెల్లింపులు, తక్కువ పనులకు అదనపు రికార్డులు చేయడం, పనులు జరిగిన వాటికి ఫొటోలు ఇవ్వకపోవడం, హరితహారంలో నాటిన మొక్కలు రికార్డులో ఉన్న సంఖ్యకు, ఫీల్డ్‌లో ఉన్న సంఖ్యకు వ్యత్యాసాలు ఉండటం, కొన్ని గ్రామాల్లో పనులకు సంబంధించిన పలు రికార్డులు చూపకపోవడం వంటి అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో తేలిందన్నారు. మండలంలో మొత్తం సామాజిక తనిఖీలో రూ.22,500 జరిమానా, రూ.5,380 రికవరీ కలిపి మొత్తం రూ.27,880 నిధులు అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. ఆయా డబ్బులను ఆయా గ్రామాల ఉపాధి సిబ్బంది నుంచి రికవరీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఓ రహీం, అంబుడ్స్‌మెన్ జిల్లా సభ్యుడు సత్యనారాయణరెడ్డి, ఏక్యూసీ హరిత, ఎంపీడీఓ గోవిందరావు, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, సామాజిక తనిఖీ, ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఆర్‌డీఓ ఉమాదేవి

పాన్‌గల్ 'ఖిల్లా'పై గుప్తనిధుల కోసం తవ్వకాలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని గట్టుపై గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు అనేక చోట్ల తవ్వకాలు జరిపిన విషయం శనివారం వెలుగులోకి వచ్చింది. గుట్టపై ఉన్న చారిత్రక కట్టడాలు, దర్గాల సమీపంలో పెద్ద ఎత్తున తవ్వకాలు జరుపుతూ కట్టడాలను ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పురావస్తుశాఖ, పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు. గుట్టపై తవ్వకాలను నిరోధిస్తూ చారిత్రక కట్టడాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వీపనగండ్ల అధ్యాపకుడికి డాక్టరేట్

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన జ్ఞానేశ్వర్ పాలమూరు యూనివర్సిటీలో రసాయనశాస్త్ర విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తూ.. ఓయూ ప్రొఫెసర్ పార్థసారథి పర్యవేక్షణలో సింథసిస్ ఆఫ్ న్యూ ఆర్గానిక్ ఛార్జ్ ట్రాన్స్‌ఫర్ కాంప్లెక్స్‌ల సంశ్లేషణ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేయడంతో డాక్టరేట్ పట్టాను పొందారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శ్రీనివాస్ జ్ఞానేశ్వర్‌ను అభినందించారు. క్యాన్సర్ వ్యాధి నిరోధక మెటీరియల్ సైన్స్‌లో జ్ఞానేశ్వర్ పరిశోధనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. జ్ఞానేశ్వర్‌ను ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ, అధ్యాపకులు డాక్టర్ అర్జున్‌కుమార్, రవికుమార్, పర్వతాలు, సుదర్శన్‌రెడ్డి, రాజశేఖర్, రామ్మోహన్, రామగౌడ్, స్వామి, మాధురి, కల్పన అభినందించారు.

'చలో ఢిల్లీ' విజయవంతం చేయండి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం వికలాంగుల సంఘం నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కురుమయ్య చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర నాయకులు పుల్జాల భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశవ్యాప్తంగా వికలాంగులకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని, ఫిబ్రవరి 10న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు ఎల్లయ్య, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలకు తరలిన యూటీఎఫ్ నాయకులు



చారకొండ: నల్గొండ జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ మహాసభలకు మండల టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షులు మహిపాల్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయులు, నాయకులు తరలి వెళ్లారు. తరలిన వారిలో యూటీఎఫ్ మండల కార్యదర్శి రాంబిక్షమయ్య, గౌరవ అధ్యక్షులు అంజయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణ, కృష్ణయ్య, పరశురాములు ఉన్నారు.

జీపీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఐటీ పరపస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు తక్కువ వేతనం చెల్లిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అశోక్, పొదిల రామయ్య, ఎం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రాములు, బాలస్వామి, వెంకటయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కలు సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి

తెలకపల్లి: నాణ్యతగా మొక్కలను పెంచాలని అడిషనల్ డీఆర్‌డీఓ రాజేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని పెద్దపల్లిలో వన నర్సరీని సందర్శించారు. నర్సరీలో నాణ్యమైన విత్తనాలు నాటాలని, ప్రతి మొక్కకు సమయానుకూలంగా నీటిని పట్టాలని, విత్తనాలను విత్తుకునే ముందు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. రైతుల వ్యక్తిగత పనులు, రైతుల పొలాలో నాటిన పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. ప్రతి గ్రామంలో సెల్ఫ్ ఆఫ్ పనులు అంచనా వేసుకొని 200 శాతం పొందాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ శ్రీనివాసులు, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, ఏపీఓ మల్లేష్, శిరీష, శ్రీరాం, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు మండలంలోని బొందలపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు అద్యపాగ సురేష్ మాట్లాడారు. ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ఒకే విడతలో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుభాష్, భాస్కర్, శివ, కృష్ణయ్య పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలోని వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.12వేలు ఇవ్వాలని, గ్రామ సభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్ సీతారామరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నర్సింహ, నందిపేట భాస్కర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల దరఖాస్తులపై జీఎస్టీ

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులపై పన్నుల భారం మోపడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సైదులు అన్నారు. శనివారం అచ్చంపేటలోని సీఐటీయూ కార్యాలయంలో డీవైఎఫ్ఐ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల దరఖాస్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్‌తో సహా మిగిలిన ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తుందన్నారు. ఉద్యోగాలు కల్పించేంతవరకు నిరుద్యోగ భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు.

గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన సన్మానం



లింగాల: ఏకలవ్య గ్లోబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన ఉల్లంగొండ రాజును శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య విగ్రహం దగ్గర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎరుకల జాతి సంక్షేమ కోసం పని చేస్తున్న ఈజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా గురుతర బాధ్యతను అందరి సహకారంతో ముందుకు పోతానని రాజు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, నాయకులు నారాయణగౌడు, పూజారి వెంకటయ్య, మల్లేష్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, భగవాన్, మాజీ సర్పంచు మల్లయ్య, శివ పాల్గొన్నారు.

బీసీ సంఘం కార్యకర్తను పరామర్శించిన నాయకులు



నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల నాగర్‌కర్నూల్ పట్టణంలో బీసీ సంఘం కార్యకర్త కొట్ర శ్రీనివాసులు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు కాళ్ళ నిరంజన్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. త్వరగా కోలుకోవాలన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం



వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి శ్రీశైలం అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం అదే గ్రామానికి చెందిన యువ నాయకులు మొక్తాల రమేష్‌ముదిరాజ్ బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. అపదలో ఉన్నవారికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో శానమోని కృష్ణయ్య, ఎండీ బాబా, గోరటి కృష్ణ, మహేష్ ముదిరాజ్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన వెంకటయ్య ప్రమాదం బారిన పడి మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శనివారం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, సూర్యలత, సూర్యప్రకాష్‌రావు, తదితరులు ఉన్నారు.

ఎంఈఎఫ్ డివిజన్ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

కొల్లాపూర్ రూరల్: మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ కమిటీని ఆ సంఘం జిల్లా కన్వీనర్ దేవరపాగ ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం కొల్లాపూర్ పట్టణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కారంగి నరసింహ, సభ్యులుగా వీరపాగ చంద్రశేఖర్, ఎల్లపోగు స్వామి, రాముడు, కిషోర్, నాగరాజు, మనోజ్‌కుమార్, వెంకటేష్, వినయ్, రవీందర్, ఈశ్వర్, తిరుపతయ్యను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా కమిటీ పని చేయాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం త్వరలో ఎస్సీ వర్గీకరణ చేసి 59 కులాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమలో మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.